# వినేనాథుడు

తలుపు తెరచి ఆశ్చర్యపోయాను.

ఎదురుగా ఆమె! ప్రక్కవాటాలోని జూనియర్ ఇంజనీరుగారి భార్య! "మీరా?" అన్నాను తొట్రుపాటుతో ఆమె మాట్లాడలేదు

"రండి" అన్నాను అక్కడనుండి కదలకుండానే

ఆమె రాలేదు! పది సెకెన్లు గడిచేక అడిగింది "మీరు అలా అడ్డంగా నిలబడితే లోపలకు ఎలా రాగలను?" నా పొరపాటు అర్థమయింది. తడబాటు కప్పి పుచ్చుకుంటూ ప్రక్కకు తప్పుకుని "సారీ రండి" అంటూ మళ్ళీ ఆహ్వానించేను.

ఆమె మెల్లగా లోనికి వచ్చి మంచం ప్రక్కన నిలబడిపోయింది. నేను తలుపు ఓరగావేసి ఆమెను అనుసరించి లోనికి వచ్చేను. గదిలో ఓ కుర్చీ అయినా లేదు. కనీసం ఓ కుర్చీ అయినా కొని గదిలో వుంచనందులకు జీవితంలో మొదటసారిగా నొచ్చుకున్నాను.

"అలా మంచంమీద కూర్చోండి" అన్నాను.

అసలే చిన్నగది. ఆమె నిలబడి వుంటే ఇటూఅటూ తిరగటానికి కూడా ఇబ్బందిగా వుంటుంది. మంచం కందిపోతుందేమో నన్నట్లు ఆమె మెల్లగా మంచం పట్టీ మీద ఓ వారగా కూర్చుంది.

సాయంకాలం అయిదున్నర గంటలయింది. అయినా వాతావరణంలో మబ్బులు వుండటం వలన గదిలో వెలుతురు మసకగానే వుంది. లైటు వెలిగించి టేబిలు మీది పుస్తకాల గుట్టను ఓ వారగా జరిపి టేబిలుమీద కూర్చున్నాను. కొంతసేపు మా మధ్య మౌనం చోటు చేసుకుంది.

గదిలో ఉక్కగా ఉంది. ఆమె మెల్లగా చీర చెంగుతో విసురుకుంటోంది. కనీసం టేబిలుఫ్యాను అయినా కొనలేని నా ఆర్థిక పరిస్థితి గుర్తుకు వచ్చింది.

ఈమె ఎందుకు వచ్చింది.? నాతో ఏంపని?

నా గది కిటికీ దగ్గర నిలబడితే వాళ్ళ డ్రాయింగురూం కనిపిస్తుంది. ఆమె ఆ గదిలో కదిలినపుడు ఈ నాలుగు నెలలలో చాలాసార్లు ఆమెను చూశాను. కానీ ఇంతవరకూ మా మధ్య పలకరింపులు, పరిచయాలు జరగలేదు.

నేను ఉదయాన్నే యూనివర్శిటీకి వెళ్ళిపోతే మళ్ళీ సాయంకాలం ఆరుదాటిన తర్వాతే నాగదికి రావటం. తర్వాత హొటలుకు వెళ్ళి భోజనం ముగించుకునివచ్చి కొంతసేపు చదువుకుని నిద్రపోవటం, ఈ చర్యలవలన పొరుగువాళ్ళతో పరిచయం పెంచుకోవటమే కష్టంనాకు. కనీసం ఇంతవరకూ ఆమె పేరయినా తెలుసుకోలేక పోయినందులకు కించిత్తు బాధ అనిపించింది. అంతలోనే మా మధ్య నిశ్శబ్దాన్ని చీలుస్తూ

"నాపేరు అనూరాధ" అందామె.

"అవునవును తెలుసు" అన్నాను ఇంకేమనాలో తోచక.

ఆమె నా వంక ఆశ్చర్యంగా చూసింది. "ఎలా తెలుసు?" అంటూ అడిగింది.

నాకు గొంతులో వెలక్కాయ పడినట్లయింది. ఏం సమాధానం చెప్పను? అబద్ధం కూడా సరిగా ఆడలేకపోయాను. "మీ వారు ఆఫీసుకు వెళ్ళేటపుడు పిలుస్తూవుంటే విన్నాను"

ఒక అబద్ధాన్ని కప్పిపుచ్చుకోటానికి మరో అబద్ధం ఆడేను. ఆ సంగతి బయటపడుతుందేమోనని ఓ వెకిలినవ్వు ముఖానికి అతికించుకున్నాను.

"మొగాళ్ళందరూ ఒకటే. ఒక్కటీ నిజం చెప్పరు" గొణిగినట్లుగా అంది. కాస్సేపాగి మళ్ళీ ఆమె అంది "మీరీ చిన్న విషయానికి కూడా అబద్ధం ఆడేరు అవునా?"

నేను మాట్లాడలేదు. ఆమె ఈవిధంగా నామీద దాడి చేయటం నాకంతగా రుచించలేదు.

"పెళ్ళయిన ఈ ఏడాదినుండీ చూస్తున్నాను. ఆయన ఒక్కసారయినా నన్ను నా పేరుతో పిలుస్తారేమోనని! ఊహూ... నా పేరు నేనే మరిచిపోయేస్థితికి వస్తున్నాను. ఏమేవ్.. ఒసేవ్... ఇత్యాదులు నాపేర్లు..." కొంతసేపాగి మళ్ళీ అంది "పోనీలెండి మీరయినా నాపేరు తెలుసుకున్నారు. ఇక మీదట నన్ను అనురాధా అని పిలవండి. అలా నాపేరుతో పిలిస్తే నాకెంతో ఇష్టం". మాటలు ఆపింది ఆమె కనులు చమర్చటం గమనించేను. ఏమనాలో తోచక తలవూపేను అంగీకార సూచకంగా.

"చదువు కునేందుకు మంచి పుస్తకాలు ఏవైనా ఇవ్వండి" అంది.

"నా దగ్గర నవలలు ఏవీలేవు, కథల పుస్తకాలు అంతకంటే లేవు. ప్రస్తుతం నేను రీసెర్చి వర్కులో వున్నాను. అందుకని కొంతకాలం వాటిని దూరం పెట్టేను" అన్నాను.

"మీరు కథలు రాస్తారట కదా" అదోలా నావంక చూస్తూ అడిగింది.

"ఆ ఏదోలెండి! తోచక అప్పుడప్పుడు! ఇప్పుడు రాయటం మానేశాను. ఈ రీసెర్చి వర్కు పూర్తయ్యేవరకూ మరోపని పెట్టుకోదల్చుకోలేదు." అన్నాను.

"మీ రీసెర్చి సబ్జెక్టు ఏమిటి?"

"శ్రీనాథుడు"

"మెటీరియల్ అంతా సేకరించారా?" అడిగింది.

"దాదాపు దొరికినట్లే, దొరికినంత మేరకు ఎదరకు వెళ్లాను. లేకపోతే మెటీరియల్ సేకరణలోనే మూడేళ్ళు గడిచిపోయేలా వుంది" అన్నాను.

"శివరాత్రి మహాత్యం పుస్తకం వుందా మీ దగ్గర"

శ్రీనాధుడు రాసిన శివరాత్రి మహాత్మ్యం గురించి ఆవిడ అడగటంచూస్తే ఆమెకు తెలుగుసాహిత్యంలో కాస్త పరిచయం ఉన్నట్లే అనిపించింది.

"నైషధంలాంటి మంచి పుస్తకాలు వుండగా శివరాత్రి మహాత్మ్యం అడుగుతున్నారెందుకు?" అన్నాను పుస్తకాల గుట్టలో దానికోసం వెదుకుతూ.

"నైషధం, భీమేశ్వర పురాణం, కాశీఖండం ఇవి మూడూ చదివేను. నైషధంలోని పద్యాలు వారానికీ పదిరోజులకీ ఓసారి చదువుకుని ఆనందిస్తూ వుంటాను. శివరాత్రి మహాత్మ్యం ఇంతవరకూ నాకులభ్యంకాలేదు. అది కూడా చదవాలని వుంది" అంది.

ఇంతవరకూ తెలుగుసాహిత్యం విషయంలో ఆమెను తక్కువగా అంచనా కట్టి నందుకు నొచ్చుకున్నాను. శివరాత్రి మహాత్మ్యం పుస్తకం వెదికితీసి ఆమెకు ఇచ్చేను. "ఇది ఆంధ్రసాహిత్య పరిషత్తు, కాకినాడ వాళ్ళు ఎప్పుడో వేసినకాపీ. బాగా నలిగిపోయి వుంది. పేజీలు పొడిలా రాలిపోతున్నాయి. జాగ్రత్తగా వుంచండి..." అని కాస్సేపాగి "పుస్తకం పరహస్తంగతం గత: అన్నారు పెద్దలు" అంటూ చిన్నగానవ్వేను.

"పరహస్తం అన్నారుకానీ నారీహస్తం అనలేదుకదా... అయినా మీరు నన్ను పరాయిదానిగా భావిస్తే ఈ పుస్తకం నాకు ఇవ్వొద్దు..." అంది కాస్త నొచ్చుకుంటున్నట్లు ముఖంపెట్టి.

"ఊరకనే జోక్ చేశాను. అంతే తీసికెళ్ళండి" అన్నాను.

"మీ పుస్తకం చాలా జాగ్రత్తగా వుంచుతాను, థేంక్యూ" అంటూ పుస్తకం పట్టుకుని వెళ్ళిపోయింది.

మూడు రోజుల తర్వాత ఓ ఉదయం నేను యూనివర్శిటీకివెళ్దామని తయారయి బయలుదేరుతూ వుంటే ఆమె పుస్తకం తీసుకుని వచ్చింది.

"పూర్తిగా చదివేరా?" అడిగేను

"ఇందులో పూర్తిగా లేదుకదా" అందామె.

సందేహంలేదు, నిజంగా ఆమె పుస్తకం చదివింది. శివరాత్రి మహాత్మ్యం నాలుగో ఆశ్వాసంలో 'అంత యముండేమి చేసె' అని అడగటంతో ఆ పుస్తకం పూర్తయిపోయింది. ఆ పుస్తకం చాలాచాలా సంవత్సరాల క్రితం అచ్చువేసిన కాపీ. అప్పట్లో వాళ్ళకి దొరికిన తాళపత్ర గ్రంథాల్లో అంతవరకే పాఠం లభించింది. మిగిలింది లేదు. దొరికినంత మేరకు ఆంధ్రసాహిత్య పరిషత్తువారు ముద్రించి, అసమగ్రంగా వదిలేశారు. అయితే ఆ తరువాత తెలంగాణా ప్రాంతంలో ఎవరింటనో పురాతన తాళపత్రగ్రంథాలు లభ్యం కావటం, వాటిల్లో అదృష్టంకొద్దీ శ్రీనాధుని శివరాత్రి మహాత్మ్యం పూర్తి పాఠం వుండటంతో, దానిని ఎవరో మహానుభావుడు సంస్కరించి, మొత్తం కావ్యం ప్రచురించటం జరిగింది.

ఆ పూర్తి పాఠం కాపీ నాకు దొరకలేదు, నావద్దలేదు.

ఈ విషయాలన్నీ ఆమెతో చెబుతూ వుంటే ఎంతో ఆత్రుత ప్రదర్శిస్తూ వింది. తర్వాత అంది "శ్రీనాథుని శైలిలో కనబడే అందాలు, పద్యాలనడకలోని సొగసులు ఈ పుస్తకంలో లేవు. నాయకుడు సుకుమారుడు తన స్వంత కూతుళ్ళనే కోరి వారితో రమించడం జుగుప్సగా లేదూ?" సూటిగా ఆమె వెలువరించిన ఆమె అభిప్రాయం విని ఆశ్చర్యపోయాను. అదీకాక నేను ఆలోచించిన ధోరణిలోనే ఆమె కూడా ఆలోచిస్తూ వుండటంతో, నా అభిప్రాయాలకు ఆమె అభిప్రాయాలు చాలా దగ్గరగా అనిపించటంతో ఆమె యెడల నాకు అభిమానం పెరిగిపోయింది.

ఆమె వద్దంటున్నా వినకుండా నాగదిలో స్టౌమీద కాఫీ కలిపేను. కప్పులో పోసి ఆమెకు అందిస్తూ "ఆయనలేరా?" అంటూ అడిగేను.

"శ్రీకాకుళం కేంపువెళ్ళేరు. చూస్తున్నారుగా రెండురోజులు ఇంట్లో వుంటే మళ్ళీ వారంరోజులు కేంపులే. మొన్న సాయంకాలం వెళ్ళిపోయారు. మళ్ళీ ఇంటిమీద మనసు మళ్ళినపుడు వస్తారు" నీరసంగా అంది.

"మరి ఉద్యోగబాధ్యతలలో ఇలాంటి కష్టాలు తప్పవుకదా" అన్నాను.

నా మాటలకు ఆమె ముఖం వెంటనే ఎర్రబడింది.

నామీద కస్సున లేచింది. "ఏమిటండీ ఆ బాధ్యతలు? దేశంలో ఏ జూనియర్ ఇంజనీర్‌కీ లేని బాధ్యతలు ఈయనొక్కరికే వున్నాయా? పెళ్ళాలను నిరాదరణగా చూస్తూ ఉద్యోగాలు చెయ్యమని ఏ ప్రభుత్వమూ చెప్పదు. అయినా ఇంటిపట్టున వుండే రెండు రోజులయినా, నా యెడల ఆదరణతో వుండొచ్చుకదా! ఎప్పుడూ గొడవలే" అంది.

"కాఫీ చల్లారిపోతుంది త్రాగెయ్యండి" అన్నాను.

కాఫీ కప్పు అందుకుంటూ 'మరి మీకో?" అంది.

ఉన్న కొంచెం పాలతోనూ ఓ కప్పు కాఫీ కలపగలిగాను ఇంక నాకెక్కడిది?

"నేను యూనివర్శిటీకి వెళ్ళేటపుడు దారిలో భోజనం చేసేసి వెళ్తాను"

"నేనూ చేస్తాను కదా. ఇంకో కప్పు ఇవ్వండి వన్ బై టూ త్రాగుదాం" అంటూ చొరవగా నావంక చూసింది. మరో కప్పు అందించేను. ఇద్దరమూ కాఫీలు ముగించాం.

ఆమె భర్తను గురించి అలా మాట్లాడుతూవుంటే వినటానికి నాకు ఇబ్బందిగా వుంది. టాపిక్ మళ్ళిస్తే మంచిదనిపించింది. అంతలో ఆమె మళ్ళీ అంది "ఏమండీ ఆడదీ ఓ మనిషేనా? కాదా?" ఈ ప్రశ్నతో మరింత తడబడ్డాను.

"ఎందుక్కాదు, మనుష్యులలో పరిపూర్ణతకు ఆడదే పరాకాష్ఠ, సంపూర్ణత్వం స్త్రీలోనే వుంది. పురుషులలో కాదు"

"ఆడదానికీ ఓ మనసూ, ఇష్టాఇష్టాలు, కోరికలు, ఇవన్నీ వుంటాయని ఒప్పుకుంటారా?"

"ఆహా నిరాక్షేపణీయంగా ఒప్పుకుంటాను. ఇంతకీ ఇవన్నీ వుండకూడదని ఎవరన్నారు?" ప్రశ్నవేశాక నా తెలివితక్కువ తనానికి నాలిక్కరుచుకున్నాను.

"ఆయనే"

"అయనంటే..."

"ఆయనంటే ఇంకెవరు? మహాపురుషుడు నా భర్త! జనార్ధనరావుగారు... నాగోడు రవంతయినా పట్టించుకోని సత్పురుషుడు..."

ఆవిడ మాటతీరు చూస్తే, పసిపిల్ల గుర్తుకు వచ్చింది! వ్యవహారం మరీ సిల్లీగా వుందని కూడా అనిపించింది. నాకు ఇబ్బందికరంగా వున్నా విషయం మార్చే వీలు లేకపోయింది. ఆమె భర్తగురించి అలా నాదగ్గర చెబుతూ వుంటే ఆమె మీద నాకేదో అధికారం ఏర్పడుతున్నట్లు కూడా అనిపించింది. కాస్త ఆవేశంతో అన్నాను "ఇది చాలా అన్యాయం స్త్రీలకు తగిన విలువ, గౌరవం ఇవ్వకపోవటంవల్లనే ఈ దేశం ఇలా తయారవుతోంది. ఇదే పాశ్చాత్య దేశాలలో చూడండి స్త్రీ పురుషులిద్దరికీ సమాన హక్కులుంటాయి. స్త్రీలకు సమాన హక్కులివ్వటం జాతి పురోగమనానికి చిహ్నం"

విభ్రాంతితో కనులు విప్పార్చుకుని వింటోంది అనూరాధ

నా ఉపన్యాసం ఆపేశాక నాకే సిగ్గుగా అనిపించింది. ఎందుకంత ఆవేశంగా మాట్లాడానా? అని! ఆమె ముఖం నిండా మాత్రం ఎంతో ఆనందం. "మీరు నాకు స్నేహితులుగా దొరకటం నా అదృష్టం" అంది విచిత్రంగా కనురెప్పలు తాటిస్తూ.

ఆమె కన్నులలోని కాంతిని చూశాక, నా మాటలతో ఆమె ఎంత ఆనందించిందో నాకు అర్ధమయింది.

"మీకు యూనివర్సిటీకి వేళవుతోంది, వెళ్ళిరండి" అంటూ లేచి నిలబడింది.

"ఎప్పుడయినా వస్తూ వుండండి" అంటూనేనూ లేచాను.

ఆమె టేబిలుమీది నా కాగితాలు చూసి "మీ దస్తూరీ చాలాబాగుంది. దస్తూరీ అందంగా వుంటే,వాళ్ళ మనసులుకూడా ఎంతో అందంగా వుంటాయట. మనసులోని నిర్మలత్వానికి వాళ్ళురాసే అక్షరాలే ప్రతీకలంటారు" అంటూ పేజీలు తిరగేసింది.

"అది నా రీసెర్చి వర్కు శ్రీనాధుడు విలక్షణంగా వాడే 'హేరాళ, హేవాక' వంటి పదాలను తీసి వాటిని పరిశీలిస్తున్నాను. శ్రీనాధుడు శృంగార రసాన్ని పోషించినతీరు, వాటిలోని అందచందాలు ఇలాంటి విషయాలన్నీ నోట్సు తయారు చేసుకుంటున్నాను."

"నాకివ్వండి రేపు తిరిగి ఇస్తాను" అంటూ చొరవగా ఆ కాగితాలు తీసుకుంది.

ఆ కాగితాలు నా ప్రాణంతో సమానం. ఇంతవరకూ వాటిని ఎవరికీ ఇవ్వలేదు. కనీసం గైడ్‌కు కూడా చూపించలేదు. పూర్తయ్యాక ఏకంగా చూపవచ్చునుకదా అని! కానీ ఈమెకు 'ఇవ్వను' అని ఎలా చెప్పగలను?

నేను ఆలోచనలో వుండగానే "ప్లీజ్ ఇవ్వరూ! చదివేసి మళ్ళీ జాగ్రత్తగా ఇచ్చేస్తాను" అంటూ నా వంక బ్రతిమాలుతున్న ధోరణిలో చూసింది. "తీసికెళ్ళండి, కానీ అది నా రీసెర్చివర్క్. అది నా ప్రాణం. జాగ్రత్తగా వుంచాలి" అన్నాను. అంతకంటే ఏమనాలో తోచక.

"గాభరాపడకండి జాగ్రత్తగా చూసి ఇచ్చేస్తాను. నాకూ మంచి స్నేహితులంటే ప్రాణం" అంటూ కాగితాలు తీసుకుని వెళ్ళిపోయింది.

రెండు రోజుల తర్వాత నిద్రలేచే సరికి ఆ కాగితాలన్నీ నాగదిలో వున్నాయి. న్యూస్‌పేపరులో భద్రంగా ఓ కట్టలా కట్టి కిటికీలోనుండి లోపలకు జారవిడిచినట్లుంది అనూరాధ. ఆత్రుతతో కట్ట విప్పి జాగ్రత్తగా ప్రతి కాగితమూ పరిశీలించాను. పేజీకి పేజీకి మధ్యన ఏమైనా కాగితం దొరుకుతుందేమోనని.

కాగితం అంటే మామూలు కాగితం కాదు. ప్రేమలేఖ లాంటి కాగితం

మొదటిసారిగా ఈ ఉదయమే ఈ ఆలోచన మనసులోకి వచ్చింది. అన్నీ వెదికినా నేనిచ్చిన కాగితాలే తప్ప వేరే ఏమీలేవు. కట్టకట్టిన న్యూస్ పేపరు కాగితాలు తప్ప! అంతే! నిరాశగా కాగితాలు టేబిలుమీద పడేశాను.

అనూరాధ నన్ను ప్రేమిస్తోందేమోనన్న అనుమానం వచ్చాక మొట్టమొదటి సారిగా నిశితంగా అద్దంలోకి చూసుకున్నాను. నా ముఖం అందంగానే కనిపించింది. అవును నాకేం తక్కువ? జనార్ధనరావు నల్లగా వుంటాడు. నేను తెల్లగా వుంటాను. ఎటు చూసినా జనార్ధనరావు అందానికి నేను తీసిపోను. అంతేకాదు. అనూరాధ అందానికి అతడు భర్తగా తగడనిపించింది. ఈ ఆలోచనలు మనసులో బలపడ్డాక హుషారుగా ఈలవేసుకుంటూ స్నానం ముగించి డ్రెస్ వేసుకుని బయటకు బయలుదేరాను.

ఆసాయంకాలం యూనివర్శిటీ నుండి తిరిగి వస్తుంటే, మా వీధి మలుపులో అనూరాధ, జనార్ధనరావు కనిపించేరు. లేతనీలం రంగు నైలెక్స్ చీరలో అనూరాధ అప్సరసలా మెరిసిపోతోంది. ఆమె ధరించిన ముత్యాల గొలుసు మధ్యలోని బంగారులాకెట్, ఆమె గుండెలమీద ఒదిగి వయ్యారాలు పోతోంది.

వాళ్ళవంక చూసి చిరునవ్వుతో "గుడీవినింగ్" అన్నాను. జనార్ధనరావు తిరిగి 'గుడీవినింగ్' అంటూ విష్ చేశాడు. అతని ముఖంలో ఏ భావమూలేదు. ఇద్దరినీ దాటుకుని గదికి వచ్చేశాను.

రెండురోజుల తర్వాత అనురాధ వచ్చింది. "ఉదయం ఆయన కేంపుకు వెళ్ళిపోయారు. 'తుఫాను వెలిసినట్లుంది బాబూ" అంటూ మంచంమీద దుప్పటీ సవరించి కూర్చుంది.

"ఏం? ఎందుకని?" అంటూ చనువుగా అడిగేను.

"ఆవేళ సాయంకాలం మీరు విష్ చేశారుకదా అప్పటినుండి ఇంట్లో ఒకటే గొడవ. ఉదయం కేంపుకి వెళ్ళేవరకు నన్ను సాధిస్తూనే వున్నారు". నాకు మనసులో దిగులు ప్రారంభమయింది. గుబులుగా కూడా వుంది "ఎందుకు?" అడిగేను.

"మీరు విష్ చేశారుకదా! అందులో గుడ్ ఈవినింగ్ ఆయనకీ, చిరునవ్వు నాకూనట! ఛీ ఒట్టి అనుమానం మనిషి!" అంది.

'జనార్ధనరావు ఘటికుడే! గొప్పగా ఎనలైజ్ చేశాడు'. అనుకున్నాను మనసులో.

"మీ దగ్గరనుండీ రీసెర్చి కాగితాలు తీసుకువెళ్ళేనుకదా ఆ రాత్రి ఆయన వాటిని చూశారు. అవి మీ దగ్గర తీసుకున్నందుకు నన్ను కొట్టేరు" ఆమాటలు అంటూంటే ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగేయి. నేను చలించిపోయాను.

జనార్ధనరావు మనిషా? పశువా? ఛీ అంత అందమయిన అనూరాధని కొట్టటానికి వాడికి చేతులెలావచ్చాయి? నా మనసు వశం తప్పుతోంది. తలుపు దగ్గరగా పెట్టి మంచం దగ్గరకు వచ్చాను.

"అనురాధా" గోముగా పిలిచాను.

ఆమె తలెత్తి నావంక చూసింది.

"మీ పరిస్థితికి నాకు చాలా జాలికలుగుతోంది. మీ వంటి అందాల భరిణ భార్యగా లభించటమే ఒక వరం. ఒక అపురూపమయిన అదృష్టం. అలాంటి మిమ్మల్ని కొట్టటానికీ, మీ మనసు గాయపరచటానికీ అతడి మనసు ఎలా ఒప్పుతోందో నాకు అర్థంకావటంలేదు." అన్నాను.

ఆమె కళ్ళు ఆనందంతో మెరిశాయి. నా ఓదార్పు మాటలు ఆమె మీద బాగా పనిచేశాయనిపించింది. నేనంటే ఎంత ఇష్టమో ఆ కనులే చెబుతున్నాయి. నామీద ఎంత ప్రేమవుందో అరుణిమదాల్చిన ఆమె బుగ్గలే చెబుతున్నాయి. ముకుళించుకుని వున్న మొగ్గల్లాంటి ఆమె పెదాలవంక చూశాను. అవి నన్ను రమ్మని ఆహ్వానం పలుకుతున్నట్లున్నాయి.

"అనూరాధా..." అంటూ మెల్లగా గొణుగుతూ ఆమెకు దగ్గరగా వెళ్ళేను. వణికిపోతున్న నా రెండు చేతులతో ఆమె ముఖాన్ని అదిమిపట్టి దగ్గరగా తీసుకుని ఎర్రని ఆమె పెదాలపై .... అంతే ఒక్క క్షణంలో నాకళ్ళముందు మెరుపు మెరిసినట్టయింది!

కళ్ళు మసకబారేయి! నా ఎడమ చెంప పగిలిపోయినంత పనయింది!!

జరిగింది తెలుసుకుని కాస్త సర్దుకుని కళ్ళు తెరచి చూసేసరికి, ఎదురుగా రౌద్రరూపంతో రొప్పుతూ ఆమె లేచి నిలబడివుంది.

"చిన్నప్పటి నుండీ అమ్మా, నాన్నా,అన్నలూ, అక్కలూ ఎవ్వరూ లేకుండా పెరిగాను. ఇంతకాలానికి మనసువిప్పి చెప్పుకునేందుకు మంచి స్నేహితుడు దొరికేడని ఎంతో ఆనందించేను. నా బాధలు మీతో చెప్పుకోవటం ద్వారా కొంతయినా ఉపశమనం దొరుకుతుందని సంబరపడ్డాను. ఛీ ఛీ మొగాళ్ళంతా ఇంతే! కుక్కలు!"

ఆమె కళ్ళ నీళ్ళు వర్షిస్తున్నాయి! కాదు ఆమె కనులనుండి నిప్పులు కురుస్తున్నాయి!

నేను నిర్విణ్ణుడనయిపోయాను!!

'ఆమెకు తిండిపెట్టి చూసేందుకు బ్రోచే నాధుడు జనార్ధనుడున్నాడు. ఆమె చదువుకుని ఆనందించేందుకు శ్రీనాధుడున్నాడు. ఆమె గోడు చెప్పుకుంటూ వుంటే వినటానికి ఓనాథుడు కావాలి. ఆ నాధుణ్ణేనేను! కేవలం వినేనాధుణ్ణి' అనుకుంటూ మంచం మీద కూలబడ్డాను. ★

(యువమంత్లీ ఏప్రిల్ 1978)